## క్లుప్తంగా

### మూలపాడు పంచాయతీకి టీబీ ముక్త్ అవార్డు



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలంలోని మూలపాడు గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ అవార్డు వరించింది. పంచాయతీ పరిధిలో టీబీ వ్యాధి ఇప్పటివరకు నమోదు కాకపోవడంతో రాష్ట్రస్థాయిలో టీబీ రహిత గ్రామంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా గ్రామ సర్పంచి చింతల భూలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పి.అనిల్‌కుమార్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో టీబీ ముక్త్ అవార్డు తమ గ్రామానికి రావడం సంతోషదాయకమని సర్పంచి భూలక్ష్మి వెల్లడించారు. జి.కొండూరు మండలం చిన్ననందిగామ గ్రామ పంచాయతీకి కూడా టీబీ ముక్త్ అవార్డు దక్కింది. గ్రామ సర్పంచి ధనేకుల శ్రీకాంత్ కలెక్టర్ ద్వారా అవార్డు అందుకున్నారు.

### మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం

చాట్రాయి: మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. క్వింటా రూ.22 వేలు చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు పోను ఎకరానికి సుమారు రూ.30 వేలు ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ పంటకు విపరీతంగా డిమాండ్ ఉండడంతో మండలంలో సుమారు 9,720 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు.

### పద్మశాలీనగర్‌లో నీటి సమస్య పరిష్కరించండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పద్మశాలీ బజార్‌లో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కొండపల్లి మున్సిపాలిటీ ఐదో డివిజన్ కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ కోరారు. ఈమేరకు ఆయన సోమవారం మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తనను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణం స్పందించిన కమిషనర్ పద్మశాలీ బజార్‌లో పర్యటించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

### కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కొండపల్లి జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, బస్టాప్, లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నేతాజీనగర్, పుట్లమ్మగట్టు, శ్రామికనగర్‌లో తాగునీటి సదుపాయం, బోరుపంపుల మరమ్మతులు, ఖాజీమాన్యంలో డ్రైనేజీ సమస్య, మోహనరావు నగర్‌లో రాత్రిపూట కాకుండా ఉదయం వేళల్లో తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మహేష్, సభ్యులు పార్వతి, శ్రీను, రమణమ్మ, శివకోటేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



జూపూడి(ఇబ్రహీంపటనం): నిమ్రా ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు పి.దేవీ గుణ శిరీషకు తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేసినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి సోమవారం తెలిపారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.విద్యావతి పర్యవేక్షణలో 'ఫార్మకోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నేచురల్ ఆయిల్స్ అండ్ దైర్ ఫార్ములేషన్స్ ఫర్ ట్రీట్‌మెంట్ ఆఫ్ పార్కిన్‌సన్స్ డిసీజ్' (పార్కిన్‌సన్ వ్యాధి చికిత్స కోసం సహజ నూనెల వినియోగం)పై రూపొందించిన గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

### బాలల చట్టాలపై అవగాహన అవసరం

మైలవరం: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు. మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశ హాలులో బాలల చట్టాలపై అవగాహన సదస్సు, సామర్థ్యం పెంపుదల అనే అంశాలపై ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, స్త్రీశక్తి టీమ్‌లకు సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ అనూరాధ, సీడీపీఓ పుష్పలత తదితరులు ప్రసంగించారు.

### నేడు విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

ముసునూరు: బాసవరప్పాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లోపూడి, సూరేపల్లి, బాసవరప్పాడు గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి 3 గంటల వరకు లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రమణక్కపేట ఏఈ మంద రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

# ఉపాధి కూలీల ఆకలి కేకలు

**రెక్కాడితే కాని డొక్కాడని బడుగు జీవులు వారు. ఏ పనీ దొరక్క ఉపాధి హామీ పనులకు వెళితే ప్రభుత్వం రెండు నెలల కూలి డబ్బులు పెండింగ్‌లో పెట్టింది. దీంతో వారి కుటుంబాల్లో ఆకలి కేకలు ప్రతిధ్వనిస్తున్నాయి. చేసిన కష్టానికి ప్రతిఫలం ఇవ్వడానికి కూడా ఇంత ఇబ్బంది పెడితే మా బోటి వాళ్లు బతుకీడ్చేదెలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

- రెండు నెలలుగా వేతనాలు అందక అవస్థలు
- బకాయిలు చెల్లించకుంటే ఎలా అని ఆవేదన



ఆగిరిపల్లి మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఆగిరిపల్లి: మండలంలో ఉపాధి కూలీలకు రెండు నెలలుగా కూలి సొమ్ము అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ పనులు చేస్తే గాని పూట గడవని పరిస్థితిలో కూలీలు రెక్కలు విరిగేలా కష్టపడినా సరైన సమయానికి కూలి అందకపోవడంతో తీవ్ర మనోవేదన చెందుతున్నారు. మండలంలో రెండు నెలల నుంచి వేతనాలు అందక ఉపాధి కూలీలు దుర్భర జీవితం గడుపుతున్నారు.

**మండలంలో 13,225 జాబ్ కార్డులు**

మండలంలోని చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఉపాధి పని శరణ్యంగా మారింది. పనికి తగిన వేతనం సక్రమంగా రాకపోయిన వ్యవసాయ కూలీలు సైతం ఉపాధి పనులకు వెళ్తుంటారు. మండలంలో మొత్తం 13,225 జాబ్ కార్డులు ఉండగా ఇందులో 8,396 కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ప్రతిరోజు ఉపాధి పనికి 1500 నుంచి 2 వేల మంది ఉపాధి పనికి వెళ్తున్నారు. అయితే ఉపాధి పనికి వెళ్లి కష్టపడినా సరైన సమయానికి ప్రభుత్వం వేతనం చెల్లించడం లేదు. మండలంలో గత జనవరి నుంచి ఇప్పటివరకు రూ.1.20 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఉపాధి పనికి సంబంధించిన వేతనాలను ప్రభుత్వం సక్రమంగా చెల్లించకపోవడంతో చాలా గ్రామాల్లోని కూలీలు ఇతర మండలాలకు, వలస బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీ బకాయిలు విడుదల చేయాలని ఉపాధి కూలీలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

**నెలాఖరు లోపు నిధులు మంజూరు**

ఈ నెలాఖరులోగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీలకు సంబంధించి వేతనాలు విడుదలవుతాయని ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే కూలీలకు వేతనాలు చెల్లిస్తాం. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నాం

–మీనాక్షి ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఏపీఓ

**ఏడు వారాల కూలి రావాలి**



ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా. అయితే ఏడు వారాల నుంచి పనికి సంబంధించిన కూలి రాలేదు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. అధికారులను కూలి డబ్బుల గురించి అడిగితే వస్తుందిలే అని చెబుతున్నారు కానీ ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు.

– మూడి కాసులు, ఆగిరిపల్లి, ఉపాధి కూలీ

**కుటుంబం గడవడం కష్టంగా ఉంది**



మా కుటుంబం గడిచేందుకు ఆధారం ఉపాధి హామీ పథకం పనులే. నాకు 8 వారాలు వేతనం రావాల్సి ఉంది. చేసిన పనులకు కూడా కూలి ఇవ్వకపోతే ఎలా? రోజువారీ కుటుంబ అవసరాలకు డబ్బులు లేకపోవడంతో శానా కష్టంగా ఉంది. ప్రభుత్వం వెంటనే కూలి డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి.

– మట్టా తులసమ్మ, నూగుండపల్లి, ఉపాధి కూలీ

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 27 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: తాము ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని, గ్రామ, మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు బాధితులు సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు అధికారులు నిర్ణీత గడువులోగా నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మొత్తం 27 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ సుందరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్జీలలో కొన్ని ఇవి...**

- నూజివీడు పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో గంజాయి లభ్యమవుతోందని, యువత పెడదారి పడుతున్నారని, ఈ విషయాన్ని పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన వాకా సోమేశ్వరరావు అర్జీని అందజేశారు. కాలనీలో వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట చీకటిలోనే రాకపోకలు సాగిస్తున్నామని, కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేక దోమలు విపరీతంగా పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నామని సమస్యలను పరిష్కరించాలని కోరారు.
- నూజివీడు మండలం యనమదలలో సర్వే నంబరు 73–2లో తనకు ఉన్న వ్యవసాయ భూమిలో బోరు వేయించుకుని పంటలు పండించుకుంటుంటే, పక్క పొలం అతను తన బోరుకు దగ్గరగా ఆయన భూమిలో బోరు వేసి కరెంటు కనెక్షన్ కోసం ప్రయత్నిస్తున్నాడని దీనివల్ల తన బోరులో నీళ్లు అందని పరిస్థితి ఉత్పన్నమవుతోందని, ఆ బోరు వినియోగంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బత్తులవారిగూడెంకు చెందిన దాసరి చంద్రరావు అర్జీని అందజేశాడు.
- నూజివీడు మండలం దేవరగుంటలో తనకు 70 సెంట్ల భూమి ఉందని, తన భూమిలోని బోరుకు ఇతరులు విద్యుత్ కనెక్షన్ కొరకు ప్రయత్నించగా తాను కోర్టులో దావా వేశానని, అయితే వీఆర్వో మల్లేశ్వరి వారికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలనే దురుద్దేశంతో తెల్లకాగితంపై తనతో బలవంతంగా వేలిముద్రలు వేయించారని, వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన మన్నే మహాలక్ష్మి అర్జీ అందజేశారు.

# పది పరీక్షలకు 66 మంది గైర్హాజరు

**నియోజకవర్గంలో 3,427 మంది హాజరు**

నూజివీడు: నియోజకవర్గ పరిధిలోని 18 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం విద్యార్థులు 3,493 మందికి గాను 66 మంది గైర్హాజరవగా 3,427 మంది హాజరయ్యారు. నూజివీడు పట్టణంతో పాటు మండలంలో కలిపి 10 పరీక్ష కేంద్రాల్లో 1,885 మందికి గాను 40 మంది గైర్హాజరు కాగా 1,845 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 435 మందికి గాను ముగ్గురు గైర్హాజరవగా 432 మంది, ముసునూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 600 మందికి గాను 12 మంది గైర్హాజరవగా 588 మంది, ఆగిరిపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 573 మందికి గాను 11మంది గైర్హాజరవగా 562 మంది హాజరయ్యారు. వేసవికాలం దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీటి వసతిని, గదులలో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

# రూ.10.57 కోట్ల మిగులు బడ్జెట్‌కు ఆమోదం

**నూజివీడు మునిసిపాలిటీ బడ్జెట్ మీటింగ్‌లో పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి**



నూజివీడు మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, పక్కన చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

నూజివీడు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ పాలకవర్గం రూ.10.57 కోట్ల మిగులు బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రారంభ నిల్వ రూ.8.02 కోట్లకు గాను, ఆదాయం రూ.52.57 కోట్లు కాగా మొత్తం ఆదాయం రూ.60.59 కోట్లుగా అంచనా వేశారు. దీనిలో ఖర్చులు రూ.50.02 కోట్లు కాగా మిగులు రూ.10.57 కోట్లుగా బడ్జెట్ అంచనాలు రూపొందించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మొత్తం బడ్జెట్‌లో రూ.6.30 కోట్లు ఆస్తి పన్ను కింద వసూలు కాగలదని అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటీ, సీఆర్‌డీఏ నుంచి వచ్చే మొత్తం అన్నింటిని కలిపి మున్సిపాలిటీ ఆదాయం కింద చూపించారు. జనరల్ ఫండ్స్ నుంచి జీతాలు చెల్లించగా మిగిలిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు అంచనాలు రూపొందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ మాట్లాడుతూ ఈ బడ్జెట్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.

**పట్టణ అభివృద్ధికి కృషి: మంత్రి కొలుసు**

నూజివీడు మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా మున్సిపాలిటీకి రెండు మంచినీటి ట్యాంకర్లను అందివ్వనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పార్కులను అభివృద్ధి చేసుకోవాలని, ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. మున్సిపాలిటీకి జేసీబీ ఉన్నందున డ్రెయినేజీల్లోని పూడిక పనులను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. నీటిపన్ను కట్టని వాళ్ల ట్యాప్‌లను మున్సిపాలిటీ అధికారులు డమ్మీలు చేయిస్తున్నారని, అలా చేయడానికి వీల్లేదని వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ అన్నారు. నీటి ట్యాప్ లేకపోయినప్పటికీ రికార్డుల్లో ఉండేసరికి పన్ను విధిస్తున్నారని, వాటిన్నింటిని జాబితా నుంచి తొలగించేలా డీఎంఏతో మాట్లాడాలని కోరగా మంత్రి వెంటనే డీఎంఏకు ఫోన్ చేసి నిజంగా ట్యాప్ లేని వారి పేర్లు రికార్డుల్లోంచి తొలగించాలని ఆదేశించారు. కౌన్సిలర్ శీలం రాము మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంకు సంబంధించి చిన్నచిన్న మరమ్మతు పనులు, ఏడెకరాల్లోని ముళ్లచెట్లు తొలగించి వాటిని కేంద్రీయ విద్యాలయ సమితికి అప్పగించాలన్నారు. దీంతో వెంటనే ఆ పనులను పూర్తిచేసి వారికి అప్పగించాలని మంత్రి కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ డీఈ, టీపీఓ, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, నివాస స్థలాలు మంజూరు చేయాలని, ఉపాధి కూలీల పని దినాలను 200 రోజులకు పెంచడంతో పాటు, కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలని, ఉపాధి హామీ పథకంలోని కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, జహంగీర్ బాషా, నైనవరపు ఉలక్కయ్య, ముత్యాల నరేష్, తాడి అర్జున్ రావు, జంగం అంజయ్య పాల్గొన్నారు.

# మాదిగలకు సమన్యాయం జరగలేదు

నూజివీడు: ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదికలో మాదిగలకు సమన్యాయం జరగలేదని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగలపూడి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ విషయమై ఏపీ ఎమ్మార్పీఎస్ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేసింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏపీలో 2011 జనాభా లెక్కల ప్రకారం కులాల వారీగా ఎస్సీ జనాభాపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2020లో ఎస్సీ కులాలపై అధ్యయనం చేసిన జేసీ శర్మ ఏకసభ్య కమిషన్ నివేదికను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్సీ కులగణన నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రిటైర్డ్ జడ్జితో ప్రభుత్వం వెంటనే కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం మరోసారి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మాదిగలు 30ఏళ్లు పోరాడినా రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కుల గణాంకాల రోస్టరుతో మాదిగలకు 6 శాతం, మాలలకు 8 శాతం, ఇతరులకు 1 శాతం చొప్పున నివేదికను ఇచ్చారన్నారు. అభివృద్ధి చెందిన మాల సామాజిక వర్గానికి అత్యధిక శాతం రిజర్వేషన్ కలిప్తూ అసెంబ్లీ తీర్మానించిందని, దీని వల్ల మాదిగలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి కృపారావు, రాష్ట్ర కార్యదర్శి కోపూరి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమే





ఆగిరిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తిరువూరులో క్షయవ్యాధి దినోత్సవంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రేష్మాబేగం

తిరువూరు: ఆరోగ్యకరమైన జీవనవిధానంతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం సూచించారు. స్థానిక యూపీహెచ్‌సీ ఆవరణలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలు దగ్గు, జ్వరం, కళ్లెలో రక్తం పడటం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి, మెడ మీద గడ్డలు వస్తే క్షయవ్యాధి లక్షణాలుగా గుర్తిస్తామన్నారు. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య చికిత్స పొందాలని, ప్రాథమిక దశలో క్షయ వ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా నివారణ సాధ్యమేనని రేష్మాబేగం తెలిపారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించుకుని ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడంతో వ్యాధి నుంచి బయట పడవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మంచి పోషకాహారం తీసుకుంటే తిరిగి మామూలు మనిషి కావచ్చన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు కె.రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, ఆరోగ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ**

ఇబ్రహీంపట్నం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్రా కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని క్షయవ్యాధి నివారణ మార్గాలపై నినాదాలు చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ క్షయ వ్యాధి నిర్మూలనపై చేపట్టిన అంశాలను వక్తలు వివరించారు. ర్యాలీలో కళాశాల ప్రతినిధులు శ్యామల దేవి, బాబులాల్, వినయ్ బాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలి**

ఆగిరిపల్లి: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జాస్తి జగన్‌మోహన్‌రావు, టీనా అన్నారు. సోమవారం క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లిలో గ్రామస్తులకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.వెయ్యి సహాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

**మందుల వాడకంతో టీబీ దూరం**

నూజివీడు: రెండు వారాల పాటు తెమడతో కూడిన దగ్గు వస్తుంటే తప్పనిసరిగా టీబీ పరీక్ష చేయించుకోవాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ అన్నారు. పట్టణంలోని టీబీ యూనిట్, పీపీ యూనిట్, ఏరియా ఆసుపత్రిల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్రసింగ్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో టీబీ పరీక్షను చేసేందుకు అధునాతన పరికరాలున్నాయన్నారు. పరీక్షల్లో టీబీ నిర్ధారణ జరిగితే ప్రభుత్వమే మందులను ఉచితంగా అందిస్తుందని, వాటిని క్రమం తప్పకుండా వాడితే తగ్గిపోతుందన్నారు. క్షయవ్యాధి రోగులు దగ్గినా, తుమ్మినా బాక్టీరియా గాలిలోకి చేరి తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. చుట్ట, బీడీ, సిగరెట్‌లతో పాటు గుట్కా తినడం వంటి అలవాట్లు ఉన్న వారు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ వైద్యాధికారి ఎ.దుర్గాభవాని, పలు పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన

మైలవరం: మ్యూచువల్ ఫండ్స్‌లో ఎలా పెట్టుబడులు పెట్టాలి, ఫండ్స్ ఎలా నిర్వహించాలి అనే అంశంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ అచ్చుతరామ్ కిషోర్ తెలిపారు. ఆసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ ఇన్ ఇండియా, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం బీకాం, బీబీఏ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సెబీ ఇన్వెస్టర్ సర్టిఫికేషన్ పరీక్ష నిర్వహించారు. విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఓ.అచ్చుతరామ్ కిషోర్ సెబీ ట్రైనర్‌గా పాల్గొని బీకాం, బీబీఏ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి లెవెల్ వన్ పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్‌లు అందజేశారు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఎలా పెట్టుబడులు పెట్టాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ విభాగం అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ జె.రాముడు పాల్గొన్నారు.

### నగర పంచాయతీ చైర్‌పర్సన్ రాజీనామా

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డిని కలిసిన తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ మార్పు విషయమై చర్చించారు. తొలుత కుదిరిన ఒప్పందం మేరకు ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి రెండు సంవత్సరాల తర్వాత పదవికి రాజీనామా చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కొనసాగారు. ఈ విషయాన్ని చైర్మన్ పదవి ఆశిస్తున్న మోదుగు ప్రసాద్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కస్తూరిబాయి తన రాజీనామా లేఖను నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసుకు అందజేశారు. త్వరలో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ రాజీనామాను ఆమోదించిన తదుపరి నూతన చైర్‌పర్సన్ ఎన్నికకు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

### చిట్లూరు భూములపై జాయింట్ సర్వే చేయాలి

చాట్రాయి: మండలంలోని కోటపాడు రెవెన్యూ పరిధిలోని చీపురుగూడెం గ్రామంలో ఆర్‌ఎస్ నంబర్ 645–7ఎ లోని సీలింగ్ భూములపై జాయింట్ సర్వే చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వే నంబరులో చిట్లూరు మల్లయ్య, వెంకటరామయ్య, నాగేశ్వరావుల అధీనంలో ఉన్న 51.25 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని రెవెన్యూ, ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే చేసి విడగొట్టి పేదలకు పంచాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ సభ్యులు రేగుల వెంకటేశ్వరావు, బాలస్వామి, మురళీ, ఏసు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ వృద్ధి చేసుకోవాలని నంబూరు వీవీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పావెల్ వెలివెంటి సూచించారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, అధ్యాపకులు మోజెస్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### శక్తి యాప్‌పై అవగాహన

ఆగిరిపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం మహిళల భద్రత, సైబర్ నేరాలు, శక్తి యాప్ ప్రాముఖ్యతపై మహిళా పోలీసులకు, గ్రామ మహిళా సంరక్షణ కమిటీ సభ్యులకు, మహిళలకు నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అవగాహన కల్పించారు. ఎస్ఐ శుభ శేఖర్ పాల్గొన్నారు.

### 1100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి తండాలో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 1100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు సోమవారం తెలిపారు.

### గురుకుల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13కి వాయిదా

జి.కొండూరు: కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26వ విద్యా సంవత్సరానికి గానూ ఐదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ నుంచి 13వ తేదీకి వాయిదాపడినట్లు ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

### మద్యం దుకాణం తొలగించాలి

విస్సన్నపేట: నిబంధనలకు విరుద్ధంగా నివాస గృహాల నడుమ విస్సన్నపేటలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు సోమవారం తహసీల్దారు లక్ష్మీ కల్యాణికి వినతిపత్రం అందజేశారు.